సాక్షి
రాజన్న సిరిసిల్ల
ఆదివారం | 2 | ఏప్రిల్ | 2023

జీవితం అంటే నిన్ను నువ్వు చూసుకోవటం కాదు, నిన్ను నువ్వు రూపుదిద్దుకోవటం.
– మహ్మద్ ప్రవక్త

ఇఫ్తార్	సహర్
ఆది: 6:33	సోమ: 4:43

రంజాన్ వేళలు

హలీం.. రుచికి సలాం..!

- ఉమ్మడి జిల్లాలో ఘుమఘుమలాడుతున్న రంజాన్ రుచులు
- నోరూరిస్తున్న వివిధరకాల వంటకాలు

8లో▸

సాయంత్రం అయ్యిందంటే చాలు రోడ్లపక్కన రంజాన్ రుచులు నోరూరిస్తున్నాయి. పవిత్ర రంజాన్ మాసంలో ఓ వైపు ముస్లింలు ఉపవాస దీక్షలు చేస్తుండగా... మరోవైపు వివిధ రకాల వంటకాలు ఇఫ్తార్ సమయంలో ఆకర్షిస్తున్నాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఉన్న పట్టణాల్లో ఏర్పాటు చేసిన రంజాన్ ప్రత్యేక స్టాళ్లలో చికెన్, మటన్ వంటకాలు ఆకట్టుకుంటున్నాయి. రంజాన్ మాసంలో లభించే అరుదైన వంటకం హలీం కోసం పోటీపడుతుండగా.. చిన్నాపెద్దా తేడా లేకుండా ఇష్టంగా ఆరగిస్తున్నారు. హలీంతో పాటు హరీస్.. ఇతర చికెన్, మటన్ పై వంటకాలు అందుబాటులో ఉంటున్నాయి. రంజాన్ రుచులు.. హలీం ప్రత్యేకతపై సండే స్పెషల్..!! – విద్యానగర్(కరీంనగర్)







న్యూస్‌రీల్

పాలకవర్గాన్ని సన్మానించిన ఎస్పీ



సన్మానిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

తంగళ్లపల్లి(సిరిసిల్ల): తంగళ్లపల్లి మేజర్ గ్రామ పంచాయతీ పాలకవర్గాన్ని శనివారం ఎస్పీ అఖిల్ మహాజన్ ఆయన ఛాంబర్‌లో సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, జిల్లా స్థాయిలో ఉత్తమ గ్రామపంచాయతీగా గుర్తింపు పొందినందుకు అభినందించారు. రానున్న రోజుల్లో మరింత అభివృద్ధిని సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్ అంకారపు అనిత, ఉప సర్పంచ్ పెద్దూరి తిరుపతి, ఎంపీవో శ్రీధర్‌రెడ్డి, వార్డు సభ్యుడు రెడ్డి పర్శరాములు, సిరిసిల్ల రూరల్ సీఐ ఉపేందర్, ఎస్సై పి.లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

ఫైలేరియా రహిత సమాజమే లక్ష్యం



ఫైలేరియా పరీక్షలను పరిశీలిస్తున్న స్నేహ

సిరిసిల్ల: ఫైలేరియా రహిత సమాజాన్ని నిర్మించేందుకు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ (డబ్ల్యూహెచ్‌వో) జోనల్ కో ఆర్డినేటర్ డాక్టర్ స్నేహ అన్నారు. జిల్లాలోని తంగళ్లపల్లి, నాంపల్లి, సిరిసిల్ల అంబేద్కర్‌నగర్, లక్ష్మీపూర్‌లోని పాఠశాలలను ఆమె శనివారం సందర్శించారు. ఒకటి, రెండో తరగతి పిల్లలకు ఫైలేరియా పరీక్షలు నిర్వహించే తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఆరు, ఏడు సంవత్సరాల పిల్లలకు ఫైలేరియా పరీక్షలు చేస్తున్నామని వివరించారు. ఫైలేరియాను కట్టడి చేసేందుకు ఈ పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో ప్రతాపరెడ్డి, హెచ్ఈవో లింగం, హెల్త్ సూపర్‌వైజర్లు రాజేందర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

తెగిన చెరువు.. వృథాగా పోతున్న నీరు



చెరువును పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు

గంభీరావుపేట(సిరిసిల్ల): మండలంలోని కొత్తపల్లి గ్రామశివారులోని అక్కపల్లి చెరువు కట్ట పాక్షికంగా తెగిపోయింది. చెరువులోని నీరు వృథాగా దిగువకు పోతోంది. ఇరిగేషన్ అధికారులకు సమాచారం అందించినా స్పందించడం లేదని రైతులు, నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. చెరువు కట్టను ఎంపీపీ వంగ కరుణ పరిశీలించారు. ఇరిగేషన్ అధికారులు త్వరగా చర్యలు చేపట్టాలని కోరారు.

సిరిసిల్లలో ఫ్రాంకింగ్ మిషన్



సిరిసిల్లలో శివబుక్ డిపోలో ఏర్పాటైన ఫ్రాంకింగ్ మిషన్


సిరిసిల్ల: జిల్లాకు రెండు ఫ్రాంకింగ్ మిషన్స్ మంజూరయ్యాయి. బ్యాంకులకు, ఇతర అగ్రిమెంట్ పత్రాలకు అవసరమైన స్టాపింగ్‌లు గతంలో సబ్ రిజిస్ట్రేషన్ ఆఫీస్‌ల్లో ఉన్న ఫ్రాంకింగ్ మిషన్స్‌పై చేసేవారు. ఇప్పుడు కొత్తగా జిల్లాకు రెండు మిషన్లు ప్రైవేటుగా మంజూరు చేశారు. సిరిసిల్ల, వేములవాడ పట్టణాలకు మిషన్స్ మంజూరు అయ్యాయి. సిరిసిల్ల గాంధీచౌక్‌లోని శివబుక్ డిపో యజమాని కముటాల శ్రీనివాస్ తొలి ప్రైవేటు ఫ్రాంకింగ్ మిషన్‌ను ఏర్పాటు చేశారు. వేములవాడకు మంజూరైన మిషన్‌ను ఇంకా ప్రారంభించలేదు. జిల్లా ప్రజలు తమకు అవసరమైన స్టాంపులకు సంబంధించి సబ్ రిజిస్ట్రేషన్ ఆఫీస్‌ల వరకు వెళ్లకుండా నేరుగా సిరిసిల్ల పట్టణంలోని చేయించుకోవచ్చని శ్రీనివాస్ తెలిపారు.

88,385 డాక్యుమెంట్లు.. రూ. 311.60 కోట్ల ఆదాయం

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 2022-23లో దండిగా రిజిస్ట్రేషన్లు

- గతేడాది కన్నా రూ.65.66 కోట్ల ఆదాయం అధికం
- కోర్టులో కేసుల పరిష్కారం అయినా నిషేధిత జాబితాలోనే ఆస్తులు
- సబ్ రిజిస్ట్రార్లకు పరిజ్ఞానం లేక మరిన్నింటికి బ్రేక్

2021 ఏప్రిల్ 1 నుంచి 2022 మార్చి 31 వరకు..	2022 ఏప్రిల్ 1 నుంచి 2023 మార్చి 31 వరకు..
డాక్యుమెంట్లు 83,650	డాక్యుమెంట్లు 88,385
వచ్చిన ఆదాయం రూ.245.94 కోట్లు	వచ్చిన ఆదాయం రూ.311.50 కోట్లు



సాక్షి ప్రతినిధి, కరీంనగర్: రిజిస్ట్రేషన్ శాఖకు 2022–23 ఆర్థిక సంవత్సరం కాసుల పంట పండింది. ఆస్తుల రిజిస్ట్రేషన్‌లు పెరగడంతో గతంలో కన్నా రూ.66 కోట్ల ఆదాయం ఎక్కువగా వచ్చింది. 2022 ఏప్రిల్ 1 నుంచి 2023 మార్చి 31 తేదీ వరకు పరిశీలించగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న 13 రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో 88,385 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ అయ్యాయి. వాటి ద్వారా ప్రభుత్వానికి రూ.311.60 కోట్ల ఆదాయం సమకూరింది. గతేడాదితో పోల్చితే రూ.65.66 కోట్లు ఎక్కువగా వచ్చింది.

అడ్డంకిగా కోర్టు కేసులు

కోర్టు కేసుల్లో ఉన్న భూముల సమస్యలు పరిష్కారం అయినప్పటికీ వాటిని ప్రొహిబిటెడ్ లిస్ట్ నుంచి తొలగించడం లేదు. కోర్టు కేసుల్లో ఉన్న సర్వే నెంబర్లలో చాలా వరకు పరిష్కారం అయినట్లు ఆర్డర్లు వచ్చినా సంబంధిత వినియోగదారులు రిజిస్ట్రేషన్ శాఖకు సమాచారం ఇవ్వకపోవడంతో ఇంకా ప్రొహిబిటెడ్ లిస్ట్‌లోనే కొనసాగుతున్నాయి. దీంతో చాలా వరకు రిజిస్ట్రేషన్‌లు నిలిచిపోతున్నాయి. కరీంనగర్ పరిధిలో చాలా కేసులు పెండింగ్‌లో ఉండడంతో రిజిస్ట్రేషన్‌లు కాలేదు. మరికొన్నింటిలో గుంటల్లో సమస్యలు ఉన్న సంబంధిత సర్వే నెంబర్‌లో కేసులు చూపించడంతో ప్రజలు భయపడుతున్నారు. కోర్టుల్లో పరిష్కారం అయిన ఆర్డర్ల సమాచారం పూర్తికాగానే రిజిస్ట్రేషన్ శాఖకు వస్తే మరిన్ని రిజిస్ట్రేషన్‌లు పెరిగే అవకాశాలున్నాయని నిపుణులు చెబుతున్నారు. ఇక గంగాధర సబ్‌రిజిస్ట్రార్ పరిధి కొత్తపల్లి మండలంలోని పలు గ్రామాలతోపాటు కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని రెండు ఏరియాల్లో ఏ ప్లాట్ రిజిస్ట్రేషన్‌కు వెళ్లినా కోర్టు నుంచి ఆర్డర్ తప్పనిసరి అవుతోంది. రిజిస్ట్రేషన్ చేసుకునే వారు హైకోర్టును ఆశ్రయించి తీర్పుల కాపీలు చూపిస్తేనే రిజిస్ట్రేషన్‌లు అవుతున్నాయి.


చదువురాని సబ్‌రిజిస్ట్రార్లు...!

కోర్టు కేసులకు సంబంధించిన ఆర్డర్లు, ఏసీబీ, ఐటీతోపాటు వివిధ సంస్థల నుంచి నిషేధిత జాబితాలో పెట్టాలని, లేదా వాటికి సంబంధించిన సమాచారం కావాలని రిజిస్ట్రేషన్ శాఖకు పంపితే.. ఆర్డర్ల అర్థాలు కూడా సబ్‌రిజిస్ట్రార్లకు తెలియడం లేదు. దీని కారణంగా వివిధ శాఖ నుంచి ఉత్తర్వులు రాగానే వాటిలో ఏముందో సరిగా అర్థం చేసుకోలేక నిషేధిత జాబితాతో పెడుతున్నారు. దీంతో వందల సంఖ్యలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కేసులతో సంబంధం లేని ఆస్తులకు కూడా ప్రొహిబిటెడ్ లిస్ట్ వంక చూపుతూ సబ్‌రిజిస్ట్రార్లు అందినకాడికి దండుకొని రిజిస్ట్రేషన్‌లు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

ఎస్ఆర్‌వో	డాక్యుమెంట్లు	వచ్చిన ఆదాయం(కోట్లలో)
గంగాధర	8,567	32.28
హుజూరాబాద్	4,926	16.39
జగిత్యాల	8,570	29.97
మల్యాల	2,342	4.94
మంథని	2,120	4.50
మెట్‌పల్లి	4,361	10.48
పెద్దపల్లి	10,401	49.21
సిరిసిల్ల	10,016	19.99
సుల్తానాబాద్	1,981	6.31
వేములవాడ	10,407	22.06
కరీనంగర్	13,818	79.72
కరీంనగర్‌రూరల్	6,198	21.89
కోరుట్ల	4,678	13.86

రవాణా శాఖ ఆదాయం రూ.303.39 కోట్లు

గతేడాదితో పోలిస్తే 54 శాతం వృద్ధి రేటు





చంద్రశేఖర్ గౌడ్

ఉమ్మడి కరీంనగర్ జిల్లా రవాణా శాఖ వార్షిక ఆదాయం రూ.303.39 కోట్లు సమకూరింది. ఉమ్మడి జిల్లా చరిత్రలో పన్నుల ద్వారా ఆదాయం తొలిసారిగా రూ.300 కోట్ల మార్కును దాటింది. గతేడాది వాహనాల కొనుగోళ్లు విపరీతంగా పెరిగాయి. దీంతో లైఫ్‌టాక్స్, క్వార్టర్లీ టాక్స్, సర్వీస్ టాక్స్‌లు అత్యధికంగా వసూలయ్యాయి. దీనికితోడు గతేడాది అధికారులు నిర్వహించిన తనిఖీల్లో జరిమానాల రూపంలో సైతం ఇబ్బడిముబ్బడిగా నిధులు రవాణా శాఖ ఖాతాల్లోకి వచ్చిచేరాయి. దీంతో ఆల్‌టైం రికార్డు సాధించినట్లయింది. క్వార్టర్లీ, లైఫ్‌టాక్స్‌లకు తోడు ఫీజుల ద్వారా రూ.40 కోట్ల 48 లక్షలు, సర్వీస్ చార్జీల ద్వారా రూ.9 కోట్ల 40 లక్షలు, తనిఖీల రూపంలో రూ.10 కోట్ల 25 లక్షల ఆదాయం వచ్చినట్లు ఉమ్మడి కరీంనగర్ జిల్లా డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ మామిండ్ల చంద్రశేఖర్‌గౌడ్ వెల్లడించారు. జిల్లాల వారీగా చూస్తే.. కరీంనగర్ జిల్లాకు రూ.149 కోట్ల 40 లక్షలు, జగిత్యాల జిల్లాకు రూ.50 కోట్ల 96 లక్షలు, పెద్దపల్లి జిల్లాకు రూ.69 కోట్ల 97 లక్షలు, రాజన్న సిరిసిల్ల జిల్లాకు రూ.33 కోట్ల 6 లక్షల ఆదాయం సమకూరిందని వెల్లడించారు. 2021–22 సంవత్సరంతో పోలిస్తే 2022–23లో 54 శాతం వృద్ధి రేటు సాధించామని స్పష్టం చేశారు.

వీధి కుక్కల వేట షురూ



సిరిసిల్లలో కుక్కలను పట్టుకుంటున్న బృందం

సాక్షి ఎఫెక్ట్..

సిరిసిల్ల: జిల్లాలో వీధి కుక్కలు దాడులు చేస్తున్నాయని పేర్కొంటూ 'పిక్కలు తీస్తున్నాయి' శీర్షికన 'సాక్షి'లో శనివారం కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన కలెక్టర్ అనురాగ్ జయంతి వీధి కుక్కలను కట్టడి చేయాలని మున్సిపల్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో రాజమండ్రికి చెందిన కుక్కలను పట్టుకునే ప్రత్యేక బృందాన్ని రప్పించారు. ఒక్క కుక్కను బంధిస్తే రూ.600 చెల్లించే ఒప్పందం మేరకు కుక్కల వేట మొదలైంది. సిరిసిల్లలో ఇప్పటికే వెయ్యి కుక్కలను పట్టుకుని వాటికి పిల్లలు పుట్టకుండా కుటుంబ నియంత్రణ (ఫ్యామిలీ ప్లానింగ్)కు ప్రణాళిక సిద్ధం చేసినట్లు మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య శనివారం తెలిపారు. గ్రామపంచాయతీల పర్యవేక్షణలో కుక్కలను కట్టడి చేసేందుకు జిల్లా యంత్రాంగం సమాయత్తమవుతుంది.

చేపల చెలిమె.. సిరిసిల్ల.. !

- మధ్యమానేరులో 'ఫిషరీష్' హబ్
- ముందుకొచ్చిన మూడు కంపెనీలు
- 500 ఎకరాల్లో ఏర్పాటు.. 10 వేల మందికి ఉపాధి
- రూ.2,000 కోట్ల పెట్టుబడులు



మధ్యమానేరు బ్యాక్ వాటర్ వద్ద స్థలాన్ని పరిశీలిస్తున్న అనితా రాజేంద్రన్(ఫైల్)

సిరిసిల్ల: 'రాజన్న సిరిసిల్ల జిల్లా జలసిరుల ఖిల్లా అయింది. భూగర్భ జలాలు పెరిగాయి.. వ్యవసాయం బాగైంది.. ఒక్క ఇల్లంతకుంట మండలంలోనే 30వేల ఎకరాల్లో అదనంగా సాగులోకి వచ్చింది. మధ్యమానేరు (శ్రీరాజరాజేశ్వర జలాశయం)లో ఆక్వాహబ్‌కు ఏప్రిల్‌లో శంకుస్థాపన చేస్తాం. 500 ఎకరాల్లో చేపల పెంపకం జరుగుతుంది. మన పిల్లలకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని మంత్రి కె.తారక రామారావు మార్చి 27న సిరిసిల్ల నెహ్రూనగర్‌లోని భవాని ఫంక్షన్‌హాల్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రకటించారు. ఇదే అంశంపై హైదరాబాద్‌లోని బీఆర్‌కే భవన్‌లో శుక్రవారం సీఎస్ శాంతికుమారి, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్, టీఎస్‌ఐఐసీ ఎండీ నర్సింహారెడ్డి మధ్యమానేరు ఆక్వా హబ్‌పై సమీక్షించారు.'

అంతర్జాతీయ విధానంలో..

అంతర్జాతీయ విధానంలో సమీకృత చేపల, రొయ్యల పెంపక కేంద్రం (ఫ్రెష్ వాటర్ ఇంటిగ్రేటెడ్ ఆక్వా హబ్)ను జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తుంది. జిల్లాలో జలసిరులు పుష్కలంగా ఉండడంతో చేపల పెంపకానికి.. మత్స్యపరిశ్రమ అభివృద్ధికి ఫిషరీష్ యూనివర్సిటీతో పాటు విదేశీ విధానంలో ఆక్వా హబ్‌ను ఏర్పాటు చేస్తున్నారు.

స్వచ్ఛమైన నీటిలో చేపల పెంపకం

ఆహారశుద్ధి ప్రోత్సాహక ప్రాజెక్టులో భాగంగా మధ్యమానేరు బ్యాక్‌వాటర్‌లో స్వచ్ఛమైన నీటిలో చేపలు, రొయ్యల పెంపక కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఏడాది పొడవునా చేపలు, రొయ్య పిల్లల ఉత్పత్తి పెంపకం కొనసాగుతుంది. ఇప్పటికే ఈ రంగంలో అనుభవం ఉన్న అమెరికాకు చెందిన ఫిష్ ఇన్ సంస్థ, ఫ్రెష్ టూ హోమ్, ఆనంద్ గ్రూప్‌లోని సీపీ ఆక్వా గ్రూప్ సంస్థలు ప్రాజెక్టు ఏర్పాటుకు ముందుకు వచ్చాయి. రూ.2వేల కోట్ల పెట్టుబడులతో ఆ సంస్థలు ఆక్వా హబ్‌ను ఏర్పాటు చేస్తున్నాయి. 200 ఎకరాల్లో ఆక్వా పరిశ్రమ, మరో 300 ఎకరాల్లో ఫిషరీస్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా పది వేల మందికి ఇక్కడ ఉపాధి అవకాశాలు ఉండనున్నాయి.

యూనివర్సిటీలో డిగ్రీ, పీజీ కోర్సులు

జిల్లాలోని తంగళ్లపల్లి మండలం చీర్లవంచ, చింతలఠాణ గ్రామాల సరిహద్దుల్లో మధ్యమానేరు జలాశయం బ్యాక్ వాటర్ వద్ద 300 ఎకరాల్లో ఫిషరీస్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తుంది. కాళేశ్వరం జలాలలో మధ్యమానేరు జలాశయం ఎప్పుడూ నిండుకుండలా నీటితో నిండి ఉంటుంది. ఇక్కడ ఫిషరీష్ యూనివర్సిటీ ఏర్పాటుతో బ్యాచిలర్ ఆఫ్ ఫిషరీస్ సైన్స్ కోర్సు (బీఎఫ్ఎస్‌సీ), మాస్టర్ ఆఫ్ షిషరీస్ సైన్స్ కోర్సు (ఎంఎఫ్ఎస్‌సీ) చదువులను అందిస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులను ఎంపిక చేసి ఇక్కడ పాఠాలను బోధించనున్నారు. మత్స్యశాఖలోని అధికారులకు ఆరునెలల కోసారి వృత్తి నైపుణ్య శిక్షణలు, శాస్త్రీయ విజ్ఞానాన్ని ఫిషరీస్ యూనివర్సిటీలో అందించనున్నారు. జిల్లాలో మధ్యమానేరు, అనంతగిరి, నిమ్మపల్లి మూలవాగు, నర్మాల ఎగువమానేరు, మల్కపేట రిజర్వాయర్, నక్కవాగు జలాశయంతో పాటు మరో 666 చెరువులు ఉన్నాయి. దీంతో ఇక్కడ యూనివర్సిటీ ఏర్పాటుకు అనువైన పరిస్థితులు ఉన్నాయి.

మధ్యమానేరును పరిశీలించిన రాష్ట్ర ఉన్నతాధికారులు

మధ్యమానేరు జలాశయం బ్యాక్ వాటర్ వద్ద చీర్లవంచ, చింతలఠాణా శివారుల్లో ఆక్వా హబ్ ఏర్పాటు స్థలాన్ని రెండేళ్ల కిందటే అప్పటి రాష్ట్ర పశుసంవర్ధకశాఖ కార్యదర్శి అనితా రాజేంద్రన్ పరిశీలించారు. ఇప్పటికే ఇక్కడ భూసేకరణ పనులు పూర్తయ్యాయి. ఈనెలలో ఆక్వా హబ్‌కు శంకుస్థాపన చేస్తామని మంత్రి కేటీఆర్ వెల్లడించారు. దీంతో మత్స్యకార్మికులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడుతాయి. జిల్లాలో 90 మత్స్యపారిశ్రామిక సంఘాలు, మరో రెండు మహిళా మత్స్యకారుల సంఘాలు ఉండగా, 5,538 మంది సభ్యులున్నారు. ఆక్వా హబ్, ఫిషరీస్ యూనివర్సిటీ ఏర్పాటుతో మత్స్యకారులకు మెరుగైను ఉపాధి దరి చేరనుంది.

నిబంధనలు అతిక్రమిస్తే క్రిమినల్ కేసులు

- కలెక్టర్ అనురాగ్ జయంతి



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్

సిరిసిల్ల: జిల్లాలో లే అవుట్ చేయకుండా ప్లాట్లను విక్రయించే రియల్టర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో సమీక్షించారు. జిల్లాలో పలు చోట్ల అనుమతి లేకుండా రియల్ ఎస్టేట్ వ్యాపారం సాగిస్తున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయని, ప్రజలు తెలిసో, తెలియకనో ఆ ప్లాట్లను కొని ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అనుమతి లేని వెంచర్ల హద్దురాళ్లను మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు తొలగించాలని ఆదేశించారు.

రెండో విడత గొర్రెల పంపిణీ


జిల్లాలో రెండో విడత గొర్రెల పంపిణీ పూర్తి చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి కోరారు. హైదరాబాద్ నుంచి రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, సీఎస్ శాంతికుమారి వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. కంటి వెలుగు, మహిళా ఆరోగ్యం, డబుల్ బెడ్రూం ఇళ్ల పథకం, తదితరవాటిపై సమీక్షించారు. అదనపు కలెక్టర్లు బి.సత్యప్రసాద్, ఎన్.ఖీమ్యానా యక్, ఆర్డీవో పవన్‌కుమార్, డీపీవో రవీందర్, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ కొమురయ్య, ఉప వైద్యాధికారి శ్రీరాములు, డాక్టర్ రజిత పాల్గొన్నారు.

వస్త్ర పరిశ్రమకు సర్కారు చేయూత



లీఫ్‌లెట్స్ విడుదల చేస్తున్న ప్రవీణ్ తదితరులు

సిరిసిల్ల: రాష్ట్ర ప్రభుత్వం వస్త్రపరిశ్రమకు చేయూతనందిస్తుందని తెలంగాణ రాష్ట్ర పవర్‌లూమ్, టెక్స్‌టైల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీఎటీడీసీ) చైర్మన్ గూడూరి ప్రవీణ్ అన్నారు. సిరిసిల్లలో శనివారం ఆయన మనోవికాస కేంద్రం రూపొందించిన లీఫ్‌లెట్స్ విడుదల చేసి మాట్లాడారు. కార్మికులకు బీమా కల్పించి వారి కుటుంబాలకు ధీమాను ఇస్తుందన్నారు. మనోవికాస కేంద్రం సైకాలజిస్ట్ కె.పున్నంచందర్ మాట్లాడుతూ, కార్మికులు ఒత్తిడికి గురికావడం, మానసిన సమస్యలు ఎదురైనప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చేతిలో ఇమిడిపోయే చిన్న సైజు కరపత్రాలను రూపొందించామన్నారు. వీటిని సిరిసిల్లలో నేతన్నలకు ఉచితంగా పంపిణీ చేస్తామని వివరించారు. కార్యక్రమంలో మనోవికాస కేంద్రం సిబ్బంది వేముల అన్నపూర్ణ, బూర శ్రీమతి, రాపెల్లి లత, కొండ ఉమ తదితరులు పాల్గొన్నారు.



క్లుప్తంగా

డబుల్ ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచండి

బోయినపల్లి(చొప్పదండి): డబుల్‌బెడ్రూం ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచాలని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ ఆదేశించారు. శనివారం మండలంలోని నర్సింగాపూర్‌లో 20 మంది లబ్ధిదారులకు చేపడుతున్న డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఇళ్ల నిర్మాణం జరిగే ప్రదేశంలో విద్యుత్ స్తంభాలు, వైర్లు ఆటంకంగా ఉన్న విషయం అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ విషయంలో స్థానిక సెస్ డైరెక్టర్ కొట్టెపెల్లి సుధాకర్‌తో అదనపు కలెక్టర్ మాట్లాడారు. ఇళ్ల నిర్మాణంలో అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలు తొలగించాలని సూచించారు. ఆయన వెంట సర్పంచు జోగినిపల్లి ప్రేమ్‌సాగర్‌రావు, తహసీల్దార్ దర్పెల్లి నరేశ్, ఆర్ఐ ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

సిరిసిల్లటౌన్: పక్షం రోజుల్లోగా మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కారం కాకుంటే నిరవధిక సమ్మె చేపడుతామని మున్సిపల్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) నాయకులు పేర్కొన్నారు. ఈమేరకు శనివారం సిరిసిల్ల లేబర్ ఆఫీసర్ రఫీకి సమ్మె నోటీస్ ఇచ్చి మాట్లాడారు. కార్మికులకు రావాల్సిన 8నెలలు పెరిగిన పీఆర్సీ బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. విలీన గ్రామాల్లోని 33 మంది కార్మికులకు పాతవి మూడేళ్ల పీఎఫ్ బకాయిలు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వాటిని వెంటనే అందించాలని లేకుంటే ఈనెల 15 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతామన్నారు. కార్యక్రమంలో నాయకులు కోడం రమణ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

లాడ్జిలపై పోలీసుల నజర్

వేములవాడ: సీతారాముల కల్యాణం సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వేలాదికి తరలివచ్చిన హిజ్రాలు పట్టణంలో హంగామా సృష్టిస్తున్నారన్న సమాచారం మేరకు స్థానిక పోలీసులు ఆలయ, ప్రైవేట్ లాడ్జిలపై ప్రత్యేక దృష్టిపెట్టారు. మైనర్ పిల్లలను తీసుకొచ్చి బలవంతంగా హిజ్రాలుగా మార్చుతున్నారన్న సమాచారం పోలీసులకు అందడంతో ప్రైవేట్ లాడ్జిలను క్షుణ్ణంగా శనివారం తనిఖీ చేశారు. పోలీసుల అలజడి గమనించిన సదరు వ్యక్తులు పరార్ అయినట్లు తెలిసింది. రాత్రి వేళ యువతరాన్ని పెడదోవ పట్టించేందుకు జరుగుతున్న చర్యలపై పోలీసులు దృష్టి సారించి కొద్ది రోజులుగా ఇక్కడే తిష్టవేసిన హిజ్రాలను పంపించి వేస్తున్నారు. రెండురోజుల కంటే ఎక్కువ లాడ్జిలలో ఉంచుకునేందుకు వీలులేదని లాడ్జ్ యజమానులకు పోలీసులు అల్టిమేటం జారీ చేసినట్లు తెలిసింది.

హామీలు నెరవేర్చాలి

కోనరావుపేట(వేములవాడ): భవన నిర్మాణ రంగ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి అన్నారు. మండలంలోని మల్కాపేటలో మాట్లాడారు. భవన నిర్మాణ రంగ కార్మికులకు మంత్రి మల్లారెడ్డి ఇచ్చిన హామీలు నెరవేర్చాలన్నారు. కార్మికులకు ద్విచక్ర వాహనాలు అందిస్తామని ఏడాది క్రితం హామీ ఇచ్చారని, ఇప్పటి వరకు ఇవ్వలేదన్నారు. నిరుపేదలైన కార్మికులు ఇల్లు లేక ఇబ్బందులు పడుతున్నారని, కార్మికులు ఇల్లు కట్టుకోవడానికి రుణాలు అందించాలని, లేకుంటే ప్రభుత్వమే నిర్మించి ఇవ్వాలని కోరారు.

వర్గీకరణను విస్మరిస్తున్న కేంద్రం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎస్సీ వర్గీకరణ విషయంలో కేంద్ర ప్రభుత్వం పిరికితనంగా వ్యవహరిస్తుందని, చిత్తశుద్ధి ఉంటే వెంటనే పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఖానాపురం లక్ష్మణ్ అన్నారు. ఎల్లారెడ్డిపేటలో శనివారం ఆయన మాట్లాడారు. వర్గీకరణను బీజేపీ విస్మరిస్తుందని, ఎస్సీ ఉమ్మడి రిజర్వేషన్ల వల్ల దశాబ్దాలుగా కొనసాగుతున్న అంతర్గత దోపిడీని చట్టబద్ధం చేయడమే అవుతుందన్నారు. వర్గీకరణ సాధనలో భాగంగా ఈనెల 4న హైదరాబాద్‌లో జరిగే నగరాల సరిహద్దుల ముట్టడికి జిల్లా నలుమూలల నుంచి పెద్దెత్తున మాదిగ ఉపకులాలు, విద్యార్థులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

- 1956లో ప్రారంభమైన ప్రస్థానం
- తొలిదశలో పోస్టు కార్డులతో ప్రచారం
- నేడు గల్లీ నుంచి రెస్టారెంట్ల వరకు విక్రయాలు
- నగరంలో రంజాన్ రుచుల సందడి
- తినేందుకు జనం ఆసక్తి

హలీం..

సండే స్పెషల్

విద్యానగర్(కరీంనగర్): హలీం.. రంజాన్ మాసంలో లభించే అరుదైన వంటకం. ముస్లింల సంప్రదాయ వంటకంగా పేరొందినా.. కాలక్రమంలో అన్ని మతాలవారు ఇష్టంగా తినడంతో ప్రాచుర్యం పొందింది. కులమతాలకు అతీతంగా ప్రజలందరూ ఇష్టపడే హలీంకు ఒకప్పుడు హైదరాబాద్ కేంద్రంగా ఉండేది. మారుతున్న కాలానికి అనుగుణంగా ఉమ్మడి కరీంనగర్‌లోని సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాకేంద్రాల్లోనూ హైదరాబాద్ రుచిని మరిపించేలా హలీం కేంద్రాలు వెలుస్తున్నాయి.

రుచికి సలాం..!



ఇలా తయారు చేస్తారు..

గోధుమ రవ్వ, నెయ్యి, మటన్ (బోన్‌లెస్), పుట్నాల పప్పు (తినే శెనగ పప్పు), గరం మసాలా, ఉల్లిపాయలు, కొత్తిమీర, పుదీనాతో తయారు చేస్తారు. లేత పొట్టేలు మాంసం అయితే రుచి బాగా ఉంటుంది. మాంసాన్ని పెద్ద మందపాటి పాత్రలో 5 గంటల పాటు ఉడికిస్తారు. గోధుమ రవ్వ, పుట్నాల పొడి, గరం మసాల వేసి బాగా కలిపి మరో 4 గంటల పాటు సన్నటి సెగపై (అడుగు అంటకుండా) ఉడికిస్తారు. బాగా మెత్తగా ఉడికిన తర్వాత ఈ మిశ్రమానికి నెయ్యి కలిపి మెత్తగా కలిసిపోయే వరకూ పొడవైన కర్రలతో రుబ్బుతారు.



ఇరాన్‌కు చెందిన హుస్సేన్ జాబిత్ 1947లో హైదరాబాద్‌లోని మదీనా సర్కిల్‌లో హోటల్ ప్రారంభించి హలీం విక్రయాలు ప్రారంభించాడు. తర్వాత కాలంలో 1956లో రంజాన్‌మాసం ప్రారంభమైన తొలిరోజు హలీం పేరుతో కొత్త వంటకాన్ని తయారు చేసి 25పైసలకు ఒక పాత్రలో ఇవ్వడంతో దీని ప్రస్థానం ప్రారంభమైంది. తొలిరోజుల్లో అంతగా ఆదరణ లభించకపోవడంతో బిర్యానీకి హలీం ఫ్రీ అని ప్రకటించారు. తర్వాత సంవత్సరం హలీం విశిష్టతను తెలియజేస్తు పోస్టుకార్డులతో ప్రచారం నిర్వహించారు. టెలిఫోన్ డైరెక్టరీ ఆధారంగా అందులో ఉన్న అడ్రస్‌లకు పోస్టుకార్డులు రాశారు. దీంతో కొంత మేర విక్రయాలు పెరిగాయి. 1956–1960 వరకు పోస్టుకార్డులు, పత్రిక ప్రకటనలు, పోస్టర్లు తదితర మార్గాల్లో హుస్సేన్ ప్రచారం నిర్వహించగా ఆయన ప్రయత్నం ఫలించింది. 1961 నుంచి హలీంకు డిమాండ్ పెరిగింది. అప్పటి నుంచి 1998 వరకు మదీనా హోటల్‌లో హలీం విక్రయాలు జరిగాయి. అదే సంవత్సరం హుస్సేన్ మరణించాడు.

కరీంనగర్‌లో 5 క్వింటాళ్ల హలీం

కరీంనగర్ నగరవ్యాప్తంగా 20 హలీం సెంటర్లు ఉన్నాయి. వాటిలో రోజూ 5 క్వింటాళ్ల హలీం తయారు చేస్తుండగా విక్రయాలతో రోజూ రూ.22 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు బిజినెస్ జరుగుతోంది. హలీం అమ్మకాలకు తోడు ఇతర ప్రత్యేక వంటకాల ద్వారా మరో రూ.5లక్షల వ్యాపారం జరుగుతోంది. హలీం తయారీకి 3 క్వింటాళ్ల మేక మాసం ఉపయోగిస్తుండగా హరీస్ తయారీ కోసం క్వింటాల్ కోడి మాంసం అవసరం అవుతుంది. రోజూ ఒక్కో హలీం సెంటర్‌లో 15 నుంచి 50కిలోల హలీం, 5 నుంచి 20 కిలోల వరకు హరీస్‌ను తయారు చేస్తారు. పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా 20 హలీం సెంటర్లు ఉండగా వాటిలో అధిక భాగం గోదావరిఖనిలో ఉన్నాయి. రోజూ రెండు క్వింటాళ్ల హరీస్ విక్రయాలు జరుగుతుండగా, 500 కిలోల హలీం అమ్మకాలు సాగుతాయి. రాజన్న సిరిసిల్ల జిల్లా పరిధిలో సిరిసిల్లలో రెండు, వేములవాడలో రెండు హలీం కేంద్రాలున్నాయి. నాలుగు కేంద్రాల్లో మొత్తం 60 కిలోల హరీస్, 20కిలోల హలీం అమ్మకాలు జరుగుతాయి. ఇక జగిత్యాల జిల్లా పరిధిలో మొత్తం 20 హలీం సెంటర్లు ఉండగా అత్యధికంగా జగిత్యాల జిల్లా కేంద్రంలోనే ఉన్నాయి. ఈ సెంటర్లలో మొత్తం 10 క్వింటాళ్ల హరీస్ అమ్మకాలు జరుగుతాయి.

20 ఏళ్లుగా అమ్మకాలు..



గత 20 సంవత్సరాలుగా హహేక్ క్యాటరింగ్ సెంటర్ ద్వారా హలీం, హరీష్, బిర్యానీ, అరేబియన్ వంటకాలను కరీంనగర్ నగర వాసులకు రుచి చూపిస్తున్నాం. హలీం తయారీలో ఇరానీ పద్ధతులు పాటిస్తునే కరీంనగర్ నగరవాసుల ఆహార అలవాట్లకు అనుగుణంగా నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ, స్వచ్ఛమైన మసాలా దినుసులు ఉపయోగించి తయారు చేయడం ఆయన ప్రత్యేకత. – బాబా పటేల్, కింగ్స్ హలీం సెంటర్, కరీంనగర్

ప్రేమాభిమానాలు ముఖ్యం..



ఉపవాస దీక్షల వల్ల ఆకలి బాధ తెలిసి పేదవాడికి కూడా సాయం చేయాలనే ఉద్దేశం కలుగుతుంది. పండుగా రోజు మతాలతో సంబంధం లేకుండా స్నేహితులను ఇంటికి ఆహ్వానిస్తాం. హలీంతోపాటు తీపితో కూడిన పాయసం తినిపిస్తాం. అందరి మనసుల్ని తీపి చేస్తూ అందరూ ప్రేమాభిమానాలతో జీవించాలని కోరుకుంటాం. – సయ్యద్ ఇర్ఫాన్, కార్ఖానగడ్డ, కరీంనగర్

ఠాణా దివస్‌ను సద్వినియోగం చేసుకోవాలి

వేములవాడ: ఎస్పీ అఖిల్ మహాజన్ ఇటీవల ప్రకటించిన ఠాణా దివస్‌లో భాగంగా ప్రతీ నెలలో మొదటి మంగళవారం జిల్లాలోని ఏదైనా ఒక పోలీస్‌స్టేషన్‌లో నేరుగా ప్రజల నుంచి విజ్ఞప్తులు స్వీకరించి వాటి పరిష్కారం కోసం కృషి చేయనున్నట్లు డీఎస్పీ నాగేంద్రచారి పేర్కొన్నారు. ఈనెల 4న వేములవాడ రూరల్ పోలీస్‌స్టేషన్ నుంచి శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. రూరల్ సీఐ కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. వేములవాడ రూరల్ మండలానికి సంబంధించిన ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, కేవలం పోలీసుశాఖకు సంబంధించిన అంశాలే కాకుండా మిగతా శాఖల అంశాలను సైతం ఎస్పీ దృష్టికి తీసుకెళ్లొచ్చన్నారు. సమావేశంలో టౌన్ సీఐ వెంకటేశ్, ఎస్సై వెంకట్రాజం ఉన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ నాగేంద్రచారి

డ్రంకెన్ డ్రైవ్ చేస్తే జైలుకే..

మద్యం మత్తులో వాహనాలు నడిపితే చట్ట పరంగా చర్యలు తీసుకుంటూ జైలుకే పంపించడం జరుగుతుందని డీఎస్పీ స్పష్టం చేశారు. హెల్మెట్ లేకుండా ప్రయాణం చేయొద్దన్నారు. బుల్లెట్లు, ఇతర సౌండ్స్ చేసే వాహనాల యజమానులు వారం రోజుల్లోగా నిబంధనల మేరకు ఉన్న సైలెన్సర్లను బిగించుకోవాలని లేకుంటే వాహనాలను సీజ్ చేస్తామన్నారు.

మృత్యువుతో పోరాడి.. ఓడి..

- పదిహేనేళ్లుగా.. జీవచ్ఛవంలా..
- అబుదాబిలో జరిగిన ప్రమాదంలో రాజయ్యకు గాయాలు
- ఇన్నాళ్లు కోమాలో ఉండి గత మార్చి 12న మృతి
- 21 రోజులకు ఇంటికి చేరిన మృతదేహం

కోనరావుపేట(వేములవాడ): పొట్ట చేతబట్టుకుని దేశం కాని దేశం వెళ్లిన ఆ అభాగ్యుడిని విధి వెంటాడింది. అక్కడ ప్రమాదం రూపంలో మృత్యువు కబళించే ప్రయత్నం చేయగా తృటిలో తప్పించుకుని జీవచ్ఛవంలా మారాడు. 15 ఏళ్లుగా ఆస్పత్రిలోనే కోమాలో ఉండి మృత్యువుతో పోరాడుతూ మార్చి 12న మృతిచెందాడు. శనివారం మృతదేహం ఇంటికి చేరగా బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. గ్రామస్తులు వివరాలు.. కోనరావుపేట మండలం కనగర్తికి చెందిన బడే రాజయ్య (52) గ్రామంలో సరైన పని దొరక్క 2005లో రూ.లక్షన్నర అప్పు చేసి మొదటిసారి అబుదాబికి వెళ్లాడు. అక్కడ రెండేళ్ల పని చేసిన తర్వాత ఇంటికి వచ్చి మళ్లీ 2007లో వెళ్లాడు. అబుదాబిలోని మస్ అనే బల్దియా కంపెనీలో కార్మికుడిగా పనిచేసేవాడు. 2008లో అక్కడి క్యాంపస్‌లో పని చేస్తుండగా పెద్ద ఇనుపగేట్ పైన పడింది. దీంతో అక్కడికక్కడే స్పృహతప్పి పడిపోయాడు. గమనించిన తోటి కార్మికులు వెంటనే అక్కడి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.



అబుదాబి ఆస్పత్రిలో కోమాలో రాజయ్య(ఫైల్)



బడే రాజయ్య (ఫైల్)

పదిహేనేళ్లుగా కోమాలోనే..

తలకు తీవ్రగాయాలు కావడంతో రాజయ్య 2008లో కోమాలోకి వెళ్లాడు. అప్పటి నుంచి అతడికి వైద్యులు చికిత్స చేస్తున్నారు. నాటి నుంచి మాటా లేదు.. ముచ్చటా లేదు. కొన్నేళ్ల వరకు కదలలేని స్థితిలోనే ఉండిపోయాడు. కాగా కొద్ది రోజుల నుంచి ఎవరైనా పిలిస్తే కళ్లు కొద్దిగా తెరిచి చూసేవాడు కానీ మాట్లాడడని అక్కడ ఉన్న స్నేహితులు తెలిపారు. రాజయ్యకు చెల్లెలు లక్ష్మి ఉండగా, బంధువులు బడే లక్ష్మణ్, శంకర్, ధర్మేందర్, అంజయ్య అంత్యక్రియలు నిర్వహించారు.

పోలీస్ వర్సెస్ బీజేపీ

సిరిసిల్లటౌన్/సిరిసిల్ల క్రైం: ఎస్పీ కార్యాలయం ముట్టడికి వచ్చిన బీజేపీ నాయకులను అరెస్టు చేసిన ఘటన జిల్లా కేంద్రంలో దుమారం రేకెత్తించింది. ఈ ఘటనలో ఇరువర్గాల మధ్య వాగ్వాదాలు జరిగి స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. బీజేపీ, పోలీసు వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం.. నాలుగు రోజుల కిత్రం సిరిసిల్ల పట్టణంలో బీఆర్ఎస్ యూత్ నాయకులు ఎంపీ బండి సంజయ్ చిత్రపటానికి తంబాకుతో అభిషేకం చేసి వినూత్న తరహాలో నిరసన తెలిపారు. దీనిపై స్థానిక బీజేపీ నాయకులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా..కేసులో పురోగతి లేకపోవడంతో శుక్రవారం ముస్తాబాద్ మండల కేంద్రంలో బీజేపీ, అనుబంధ సంఘాల నాయకులు సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ చిత్రపటాలకు కసూరి కార్తీక్‌రెడ్డితో పాటు మరి కొంత మంది లిక్కర్ సీసాలతో అభిషేకం చేసి నిరసన తెలిపారు. ఈఘటనపై బీఆర్ఎస్ నేతలు పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. బీజేపీ నేతలను పోలీసులు రిమాండ్ నిమిత్తం సిరిసిల్ల రూరల్ పోలీస్టేషన్‌కు తీసుకొచ్చారు. ఈసందర్భంగా బీజేపీ నాయకులు.. పోలీసులు ఏకపక్షంగా బీఆర్ఎస్ నేతలకు వత్తాసు పలుకుతున్నారని విమర్శలు చేశారు. న్యాయం కావాలని నినదిస్తూ ఎస్పీ ఆఫీస్ ముట్టడికి బయల్దేరారు. ఈక్రమంలోనే శనివారం తంగళ్లపల్లిలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఫర్నీచర్ ధ్వంసం చేశారని అందిన ఫిర్యాదులో తమ నాయకులను పోలీసులు అరెస్టు చేశారని ఏబీవీపీ నాయకులు వేరుగా ఎస్పీ కార్యాలయానికి తరలివచ్చారు. కొద్ది సమయంలోపే బీజేపీ నాయకులు అధిక సంఖ్యలో తరలిరావడం ఆందోళనకు దిగడంతో పోలీసులు భారీబందోబస్తు ఏర్పాటు చేశారు. చాలా సమయం ఇరువర్గాల మధ్య వాగ్వాదాలు జరిగాయి. ఈక్రమంలో బీజేపీ నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డిబోయిన గోపి, రాగుల రాజిరెడ్డి, బమ్మడి స్వామి, సింగరవేణి కిషన్, తదితరులపై కేసు నమోదు చేసినట్లు సీఐ అనిల్‌కుమార్ తెలిపారు.



బీజేపీ నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు

రాజన్న రాజ్యం షర్మిలతోనే సాధ్యం

- వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు చొక్కాల రాము

తంగళ్లపల్లి(సిరిసిల్ల): తెలంగాణలో రాజన్న రాజ్యం రావాలంటే వైఎస్ షర్మిలతోనే సాధ్యమని వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు చొక్కాల రాము అన్నారు. శనివారం మండలంలోని రాళ్లపేట గ్రామానికి చెందిన సుమారు 30 మంది వైఎస్సార్‌టీపీలో చేరగా, వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రం సాధించుకున్నా నీళ్లు, నిధులు, నియామకాల ప్రక్రియ అసంపూర్తిగానే ఉందన్నారు. నిరుద్యోగుల ఆత్మహత్యలు ఆగలేదని, పోటీ పరీక్షల్లో అవినీతి రాజ్యమేలుతోందని, అందువల్లే గ్రూప్స్ వంటి పరీక్షలు రద్దు చేయాల్సి వచ్చిందన్నారు.



మాట్లాడుతున్న చొక్కాల రాము

రాష్ట్రంలో సబ్బండ వర్గాల అభివృద్ధి, సమ్మిళిత వృద్ధి జరగాలంటే రాజన్న బిడ్డ వైఎస్ షర్మిల ఒక్కరితోనే సాధ్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు సత్తు జలంధర్‌రెడ్డి, సోమ నాగరాజు, రమేశ్, కర్ణాకర్, తిరుపతి, శ్రీనివాస్, కట్ట లచ్చయ్య, ఇల్లందుల శంకర్, రాచర్ల రాజు, బాలకిషన్, రవి, వెంకటేశ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు స్కూల్ తీరుపై ఏబీవీపీ ఆగ్రహం

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలం కేంద్రంలోని ఓ ప్రైవేటు పాఠశాల యాజమాన్యం ఫీజు చెల్లించలేదని 5వ తరగతి చదువుతున్న బాలికను శుక్రవారం స్కూల్ వ్యానులో నుంచి దింపేసిన ఘటనపై ఏబీవీపీ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం సదరు పాఠశాలకు చేరుకుని యాజమాన్యంతో మాట్లాడారు. యాజమాన్యం ఇచ్చిన సమాధానానికి కోపోద్రిక్తులై ఆఫీస్ రూములోని ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారు. ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్ మారవేణి రంజిత్‌కుమార్ మాట్లాడుతూ, ఫీజు చెల్లించలేదని సాకుతో విద్యార్థిని వ్యానులో నుంచి దింపేసిన ఘటన జరిగి 24 గంటలు గడుస్తున్నా డీఈవో, ఎంఈవో ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఒకే స్కూల్‌ను సరస్వతి, చైతన్య, శుభోదయ పేర్లతో ఎలాంటి అనుమతులు లేకుండా నడుపుతున్నారని ఆరోపించారు. విద్యాశాఖ అధికారులు మొద్దు నిద్రలో ఉంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై వెంటనే చర్యలు తీసుకోవాలని లేకుంటే డీఈవో కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. ఎస్సై లక్ష్మారెడ్డి తన సిబ్బందితో పాఠశాలకు చేరుకుని ఏబీవీపీ నాయకులు రంజిత్‌కుమార్, నాగరాజు, రాజు, మధు, తిరుపతి, రాహుల్, వంశీ, శ్రీనివాస్‌లను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు.



ఫర్నీచర్ ధ్వంసం చేస్తున్న నాయకులు

బీజేపీని ప్రజలు తరిమికొట్టాలి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): సుదీర్ఘకాలంగా ప్రజల మధ్యలో ఉండి దేశాన్ని అభివృద్ధిలో నడిపించిన గాంధీ కుటుంబానికి చెందిన రాహుల్‌గాంధీ పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయడం అన్యాయమని, మతతత్వ బీజేపీని ప్రజలు తరిమికొట్టాలని కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు కేతిరి జగన్మోహన్‌రెడ్డి అన్నారు. ఎల్లారెడ్డిపేటలోని కాంగ్రెస్ కార్యాలయంలో శనివారం మాట్లాడారు. రాహుల్‌గాంధీ భారత్ జోడో పాదయాత్ర ప్రజల్లోకి వెళ్లి బీజేపీ ప్రభుత్వం చేస్తున్న అన్యాయాలపై నిలదీస్తున్నారని, దీంతోనే సభ్యత్వాన్ని రద్దు చేయడం జరిగిందన్నారు. నేడు ప్రధాని మోడీ ప్రజలకు జవాబు చెప్పలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. సమావేశంలో మండల అధ్యక్షులు దొమ్మాటి నర్సయ్య, కిసాన్‌సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు రాజునాయక్, పోచయ్య, రాములు, రఫీక్, బాలయ్య, రాంరెడ్డి, బాబు, రాజేందర్, శ్రీనివాస్, దేవయ్య, ఎల్లయ్య, మల్లారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, గంగయ్య, రవి పాల్గొన్నారు.



సమావేశంలో కాంగ్రెస్ నాయకులు

కక్షపూరిత రాజకీయాలకు బీజేపీ స్వస్తి పలకాలి

చందుర్తి(వేములవాడ): కక్షపూరిత రాజకీయాలకు బీజేపీ స్వస్తి పలకాలని లేకుంటే రానున్న ఎన్నికల్లో ప్రజలే తగిన రీతిలో బుద్ధి చెబుతారని కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం మండల అధ్యక్షుడు చింతపంటి రామస్వామి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీపై వేసిన అనర్హత వేటును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామన్నారు. నరేంద్రమోడీ దేశ ప్రజలకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారని, ప్రజలందరినీ మోసం చేసిన ప్రధాని కూడా శిక్షకు అర్హుడేనని గుర్తు చేశారు. బేషరతుగా రాహుల్‌గాంధీపై అనర్హత వేటును వెనక్కితీసుకోవాలన్నారు. సమావేశంలో జోగాపూర్ ఎంపీటీసీ మ్యాకల గణేశ్, జిల్లా ప్రధాన కార్యదర్శి గొట్టే ప్రభాకర్, నాయకులు పులి సత్తయ్య, దారం చంద్రం, సంటి ప్రసాద్, వెల్పుల దేవస్వామి, ఇందూరి శేఖర్, సంతుపూరి బాలకృష్ణారెడ్డి, గోర్రె నందు, దెబ్బటి వెంకటేశం పాల్గొన్నారు.

జిల్లా పోలీస్ బాస్ తొలి ప్రయత్నం

- వేములవాడ నుంచే ఠాణా దివస్ ప్రారంభం

వేములవాడరూరల్: ఏళ్లుగా పరిష్కారం కాకుండా ఉన్న గ్రామీణ ప్రాంత ప్రజల సమస్యలను నేరుగా విని వాటి పరిష్కార దిశగా చర్యలు తీసుకునేందుకు ఠాణా దివస్ కార్యక్రమానికి ఎస్పీ అఖిల్ మహాజన్ ఈ నెల 4న శ్రీకారం చుట్టనున్నారు. వేములవాడ రూరల్ మండల పోలీస్‌స్టేషన్‌లో మొదట కార్యక్రమాన్ని ప్రారంభించి తదుపరి జిల్లాలోని అన్ని మండలాల్లో గల స్టేషన్‌లలో ఠాణా దివస్‌ను నిర్వహించనున్నారు. గతంలో ప్రజల వద్దకే పోలీస్ పేరుతో కార్యక్రమం నిర్వహించగా ప్రస్తుతం ఎస్పీ ఠాణా దివస్ పేరుతో పోలీస్ స్టేషన్‌కే వెళ్లి అక్కడే సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు ఈ కార్యక్రమం చేపడుతున్నారు. మొదటగా జరిగే ఈ కార్యక్రమం విజయవంతం అయ్యేందుకు రూరల్ ఎస్ఐ నాగరాజు ఇప్పటికే మండలంలోని 17 గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఐ కోరారు.



అఖిల్ మహాజన్, ఎస్పీ

కాన్షీరాం విగ్రహ ఆవిష్కరణ విజయవంతం చేయాలి

సిరిసిల్లఅర్బన్: బహుజన సమాజ్ పార్టీ వ్యవస్థాపకుడు మాన్యవార్ కాన్షీరాం విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి అంకని భాను, జిల్లా అధ్యక్షుడు వర్దవెళ్లి స్వామిగౌడ్ పిలుపునిచ్చారు. సిరిసిల్ల ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈనెల 8న కోనరావుపేట మండలం సుద్దాల గ్రామంలో కాన్షీరాం విగ్రహ ఆవిష్కరణకు బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ రానున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఉపాధ్యక్షుడు చంద్రునాయక్, జిల్లా కార్యదర్శులు లింగంపల్లి మధుకర్, బొడ్డు మహేందర్, నాయకులు గజ్జెల అశోక్, నంద్యానాయక్, తాటిపెల్లి అంజయ్య, నరేష్, శ్రీనివాస్, ధర్మేందర్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



సమావేశంలో నాయకులు

తంగళ్లపల్లిలో కారు బీభత్సం

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండల కేంద్రంలో కారు బీభత్సం సృష్టించింది. ప్రత్యక్ష సాక్షుల వివరాలు.. . మండెపల్లి గ్రామానికి చెందిన పెద్ది పరుశరాములు తంగళ్లపల్లి నుంచి తన గ్రామానికి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా మండెపల్లి వైపు నుంచి వేగంగా వస్తున్న కారు ఎదురుగా ఢీకొట్టింది. అంతటితో ఆగకుండా ఎగుర్ల సత్తవ్వను ఢీకొని పక్కనే ఆగి ఉన్న ఆటోను కూడా ఢీకొట్టి ఆగిపోయింది. అదృష్టవశాత్తు కారులో ఎయిర్ బ్యాగులు ఓపెన్ కావడంతో అందులో ఉన్న నలుగురు యువకులకు ప్రాణపాయం తప్పింది. పెద్ది పరుశరాములుకు కాలు విరగగా, ఇమ్మడోజు సాయితేజ, సాయికుమార్, రమణ, ప్రశాంత్, సత్తవ్వలకు తీవ్రగాయాలయ్యాయి. సత్తవ్వ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ తరలించారు. తంగళ్లపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాదానికి కారణమైన కారు

అదనపు టీఎంసీ పనులపై సమీక్ష

బోయినపల్లి(చొప్పదండి): మండలంలో చేపడుతున్న కాళేశ్వరం ప్రాజెక్టు అదనపు టీఎంసీ వరద కాల్వ పనుల పురోగతిపై వేములవాడ ఆర్డీఓ పవన్ కుమార్ శనివారం తహసీల్దార్ దర్పెల్లి నరేశ్‌తో కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా భూసేకరణ, తదితర పనులు ఎంతవరకు వచ్చాయో తెలుసుకున్నారు. కాల్వ నిర్మాణంలో అర్హులకు పరిహారం అందేలా చూడాలని పేర్కొన్నారు. పరిహారం ఎంతమందికి ఇచ్చారు. తదితర అంశాలు తెలుసుకున్నారు.